దేవాదాయ భూమిపై సీఎంఓ విచారణ

- దేవాదాయ శాఖ భూమిలో మున్సిపల్ రోడ్డుపై సీరియస్
- నార్సింగిలో కదలనున్న పీఠాలు
- తీర్మానం చేసిన వారిలో గుబులు

మణికొండ: 'దేవాదాయ శాఖ భూమి నుంచి యదేచ్ఛగా ప్రైవేటు రోడ్డు' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో మార్చి 18న వచ్చిన కథనంపై ఏకంగా సీఎం కార్యాలయం స్పందించింది. నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 303లో 16.01 ఎకరాల దేవాదాయ శాఖ భూమి ఉంది. మచిలేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లేందుకు ఆ భూమి గుండా చిన్న దారి ఉంది. దాన్నే రోడ్డుగా చూయించి పక్కనే ఓ విల్లా గేటెడ్ కమ్యూనిటీకి అనుమతులను పొందారు. అక్కడితో ఆగకుండా ఎలాగైనా సదరు బాటను పెద్ద రోడ్డుగా మారిస్తే తమ రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని భావించి ఏకంగా మున్సిపాలిటీ నిధులతో సీసీ రోడ్డు వేసేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. దీంతో మున్సిపల్ పాలకులకు అడిగినంత ఇచ్చి వారితో కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయించారు.

◆ మున్సిపాలిటీలో తీర్మానం చేసి టెండర్‌లను పిలవటంతో పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ గత నెల 17న పనులను ప్రారంభించేందుకు యత్నించాడు. విషయం తెలుసుకుని దేవాదాయ శాఖ ఈఓ పనులను నిలిపివేయించారు. తిరిగి పనులను కొనసాగించటంతో మున్సిపల్ కమిషనర్‌తో పాటు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విషయాన్ని 'సాక్షి' దినపత్రిక ప్రచురించింది.


సాక్షి
దేవాదాయ శాఖ భూమి నుంచి..
యథేచ్ఛగా ప్రైవేటు రోడ్డు

మార్చిలో ప్రచురించిన 'సాక్షి' కథనం

◆ ఈ విషయాన్ని దాన్ని స్థానికులు కొందరు సీఎం కార్యాలయానికి పంపటంతో వారు స్పందించి విచారణ చేపట్టినట్టు దేవాదాయ శాఖ ఈఓ నరేందర్ ప్రకటించారు.

విచారణపై గుబులు...

దేవాదాయ శాఖ భూమిలో వారి అనుమతులు లేకుండా మున్సిపాలిటీ నిధులతో రోడ్డు వేసేందుకు యత్నించి విఫలమైన నార్సింగి మున్సిపాలిటీ పాలక కమిటీతో పాటు అధికార యంత్రాంగం ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయం విచారణ చేపట్టడంతో వారికి గుబులు పట్టుకుంది.

◆ నిబంధనలకు విరుద్ధంగా తాము వ్యవహరించిన విషయం, పోలీసు కేసు నమోదు కావటం లాంటి విషయాలు ముఖ్యమంత్రి కార్యాలయం తెలుసుకుని తమపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీకి చెందిన ఓ ముఖ్య అధికారి మాత్రం తనకు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పీఎస్ అండ ఉందని, తాను ఎలాగైనా బయటపడతానని కొందరి వద్ద ధీమా వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

త్వరగా రిజిస్ట్రేషన్‌లు పూర్తిచేయాలని వినతి


సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: బుద్వేల్ ప్రాంతానికి చెందిన రైతు కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ తహసీల్దార్, రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు కోరని బాల్‌రాజ్, కోరని సదానంద్‌లు మాట్లాడుతూ.. బుద్వేల్ సర్వే నెంబర్ 282 నుంచి 299 వరకు ఉన్న స్థలంలో 66 మంది పట్టాదారులకు ప్రభుత్వం 800 గజాల చొప్పున స్థలం ఇచ్చేందుకు ముందుకొచ్చిందన్నారు. గతంలో 66 కుటుంబాలకు చెందిన సభ్యులు బుద్వేల్‌లోని 281 ఎకరాల భూమిని సాగు చేసేవారన్నారు. ప్రభుత్వం ఈ భూములను వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం తీసుకుందన్నారు. ఈ విషయమై 18 ఏళ్లుగా పోరాటం చేసినా.. ప్రతి రైతు కుటుంబానికి 800 గజాల స్థలాన్ని ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఈ స్థలాన్ని త్వరగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలను అప్పగించాలన్నారు. శుక్రవారం తహసీల్దార్‌తో పాటు సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి కోరామన్నారు. యాదయ్య, కుమార్, సన్నీ, అనంతయ్య తదితరులున్నారు.

సీబీఐటీలో ఆవిష్కరణ దినోత్సవం



మణికొండ: ప్రపంచ ఆవిష్కరణ, సృజనాత్మకత దినోత్సవాన్ని సీబీఐటీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఏప్రిల్ 21న ప్రపంచ ఆవిష్కరణ, సృజనాత్మకత దినోత్సవాన్ని నిర్వహిస్తుంటామన్నారు. సమస్య పరిష్కారంలో సృజనాత్మకత, ఆవిష్కరణల ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచటం, ఆలోచనలను ప్రోత్సహించటం ఈ రోజు ముఖ్య లక్ష్యమన్నారు. ఏసీఐసీ-సీబీఐటీ, ఏఐసీ, ఐఐఐటీ హైదరాబాద్‌లు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయన్నారు. వివిధ రకాల ఇన్నోవేషన్ టాక్స్ ద్వారా విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి వేదికలు ఉపయోగపడతాయన్నారు. అశోక్, చంద్రశేఖర్, ఉదయభాస్కర్, సూరజ్, మొయ్యార్, డాక్టర్ శ్రీనివాస్‌లు తమ ఆవిష్కరణల్లో ఎదురైన సవాళ్ల గురించి వివరించారు. రవిశంకర్, అబ్దుల్, అతీక్ హుస్సేన్, వైష్ణవిరెడ్డి తదితరులున్నారు.

ఘనంగా మల్లన్న కల్యాణోత్సవం


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి ఎర్రబోడలోని బీరప్ప దేవాలయంలో మల్లికార్జున స్వామి, బ్రహ్మరాంబిక రత్నాంగిదేవి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. శుక్రవారం దేవాలయ ఆవరణలో పండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన కురుమ కులస్తులతో పాటు గ్రామస్తులు స్వామివారి కల్యాణోత్సవంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బీరప్ప స్వామి జాతర సందర్భంగా దేవాలయాన్ని అలంకరించారు. విద్యుత్ దీపాలు, అరటి, మామిడి, కొబ్బరి తోరణాలతో పాటు వివిధ రకాల పూలతో అందంగా ముస్తాబు చేశారు. హైదర్‌గూడ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

వేర్వేరు ప్రయాణికుల వద్ద బంగారం పట్టివేత



శంషాబాద్: ఇద్దరు వేర్వేరు ప్రయాణికుల వద్ద కస్టమ్స్ అధికారులు బంగారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. దుబాయ్ నుంచి 6ఈ-1484 విమానంలో వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడి వద్ద ఉన్న చేతికి ఉన్న బ్యాండ్స్‌ను అధికారులు పరిశీలించారు. బ్యాండ్‌లో ఉన్న బీడ్స్‌లో 230 గ్రాముల బంగారం బయటపడింది. బంగారం విలువ సుమారు రూ.13.5 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రయాణికుడి వద్ద..

◆ జెడ్డా నుంచి వచ్చిన మరో ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు పరిశీలించగా.. అతడి కాలు కింది భాగంలో అతికించి ఉన్న 250 గ్రాముల బంగారు బిస్కెట్ బయటపడింది. బంగారం విలువ రూ.15 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జంగమ అర్చక సంక్షేమ సంఘం సభ్యుల నియామకం



శంషాబాద్: తెలంగాణ రాష్ట్ర జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం పట్టణంలోని సిద్దులగుట్ట దేవాయలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం 33 జిల్లాలకు సంఘం అధ్యక్షులను నియమించారు. రాష్ట్ర జంగమ సమాజ అధ్యక్షులు రుమాండ్ల విశ్వేశ్వరయ్య, వీరశైవ ఆగమపరిషత్ అధ్యక్షులు పరమేశ్వరయ్య, తెలంగాణ జంగమ పురోహిత అధ్యక్షులు వీరమయ్య స్వామి సిద్దులగుట్ట దేవాలయ చైర్మన్ నరేందర్ చేతుల మీదుగా గుర్తింపు కార్డులను అందజేశారు.

వీరశైవ అర్చక పురోహితులందరూ.. ఐక్యమత్యంగా ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. గౌరవ అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య, సంఘం ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి నందీశ్వర్, సంయుక్త కార్యదర్శి నరేందర్, కోశాధికారి శైలపతి, కార్యవర్గ సభ్యులు జగదీశ్వర్, మహేష్ తదితరులున్నారు.

క్లుప్తంగా...

గ్రాడ్యుయేషన్ డే



మణికొండ: నారాయణ ఒలంపియాడ్ స్కూల్‌లో శుక్రవారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ పర్హానా, ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ, ఆర్ఐ మాధవరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సౌమ్యలు విద్యార్థులకు పట్టాలను అందజేశారు.

ఈద్గాల వద్ద ఏర్పాట్ల పరిశీలన



మణికొండ: రంజాన్ సందర్భంగా నిర్వహించే ప్రార్థనలకు నార్సింగిలోని ఈద్గాను సిద్ధం చేశారు. శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న ఈద్గా వద్ద అవసరమైన ఏర్పాట్లను చేపట్టారు. ఎండ వేడిమి నుంచి ఉపశమనంగా ఉండేందుకు టెంట్లను ఏర్పాటు చేయగా.. నార్సింగి కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్ ఏర్పాట్లను పరిశీలించారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

రాజేంద్రనగర్: గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఇంద్రసేనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆరాంఘర్ పిల్లర్ నెంబర్ 323 ప్రాంతంలో 60-65 ఏళ్లున్న వృద్ధురాలు స్థానికంగా భిక్షాటన చేస్తూ నివసించేది. శుక్రవారం ఉదయం ఆమె మృతి చెంది ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని కుటుంబ సభ్యులెవరైనా ఉంటే రాజేంద్రనగర్ పోలీసులు, మార్చురీ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి

- అవసరమైన చోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణం
- ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ



ట్రాఫిక్ సమస్యలపై అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ తెలిపారు. శుక్రవారం కొండాపూర్ వైపు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ కోసం వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, ట్రాఫిక్ ఏసీపీ హన్మంతరావు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీహబ్, హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ వంటి ప్రాంతాలతో రద్దీ ఎక్కువగా ఉంటోందన్నారు. నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లను నిర్మిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో నిధులు కేటాయింపు జరుగుతోందన్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా శేరిలింగంపల్లిలో ఫ్లైఓవర్లను నిర్మించామన్నారు. ఫ్లైఓవర్ల నిర్మాణ సమయంలో వాహనదారులకు ఇక్కట్లు కలుగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్‌ఆర్‌డీపీ కింద చేపట్టిన పనులతో శేరిలింగంపల్లిలో ట్రాఫిక్ సమస్యలన్నీ దాదాపు తీరుతున్నాయన్నారు. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లే కాకుండా నగరంలోనే అత్యధికంగా లింకురోడ్ల నిర్మాణం కూడా శేరిలింగంపల్లిలో ఉన్నాయని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో అన్ని నిర్మాణాలు, రోడ్ల విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు శాశ్వతంగా దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎస్‌ఈ వెంకటరమణ, ఈఈ నామ్య, డీఈ హరీష్, జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈ శ్రీనివాస్, స్ట్రీట్ లైట్స్ ఈఈ ఇంద్రదీప్ పాల్గొన్నారు.

హిమాచల్‌ప్రదేశ్ అధికారులు 'బండ్లగూడ జాగీర్' కార్పొరేషన్ సందర్శన


హిమాచల్‌ప్రదేశ్ అధికారులతో కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను హిమాచల్‌ప్రదేశ్ అధికారులు సందర్శించారు. శుక్రవారం 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్' కు చెందిన అధికారుల బృందం కార్పొరేషన్ అధికారులతో సమావేశమైంది. హిమాచల్‌ప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని పెంచేందుకు నేషనల్ అర్బన్ డిజిటల్ మిషన్ అమలు చేసేందుకు తెలంగాణలో అమలు చేస్తున్న ఆన్‌లైన్ సేవలు, ఇంటి పన్ను మదింపు, రివిజన్ పద్ధతులను కార్పొరేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. హిమాచల్‌ప్రదేశ్ ధర్మశాల మున్సిపల్ కమిషనర్ అనురాగ్‌చందర్, డైరెక్టర్ ఆఫ్ అర్బన్ డెవలప్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ జగస్ ఠాకూర్, డైరెక్టర్ ఆఫ్ అర్బన్ డెవలప్‌మెంట్ బి.ఆర్.శర్మ, ప్రదీప్‌వర్మ, ప్రాజెక్టు ఆఫీసర్ రాజేందర్, ధరమ్‌పాల్ శర్మ, డాక్టర్ కిషన్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అక్షిత్‌గుప్తా, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి, సీడీఎంఏ కన్సల్టెంట్ ఇషాక్ మహమ్మద్, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, రెవెన్యూ అధికారి నిర్మల, అకౌంటెంట్ కృష్ణయ్య తదితరులున్నారు.

నేడు ఇంద్రారెడ్డి వర్ధంతి

రాజేంద్రనగర్: మాజీ హోంమంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి వర్ధంతిని శనివారం నిర్వహిస్తున్నట్లు సీనియర్ నాయకులు ఇంద్రపాల్‌రెడ్డి ప్రకటించారు. డైయిరీ ఫామ్ చౌరస్తాలో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, యువజన నాయకుడు కార్తీక్‌రెడ్డి, కార్పొరేటర్ అర్చనాజయప్రకాష్‌లు హాజరుకానున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

కరపత్రం ఆవిష్కరణ



బండ్లగూడ: భారతదేశంలో శాంతి కోసం, క్రైస్తవ సమాజం సంక్షేమం కోసం మే 4న ఎల్‌బీ స్టేడియంలో జాతీయ ప్రార్థన సమావేశం నిర్వహిస్తున్నట్లు శాసన మండలి సభ్యుడు డి.రాజేశ్వరరావు ప్రకటించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్ హిమగిరినగర్ పెనుయేల్ గాస్పల్ చర్చిలో రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ కె.సుందర్‌పాల్ అధ్యక్షతన సన్నాహక ప్రార్థన సమావేశం నిర్వహించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ కె.నతానియేల్, రెవరెండ్ గోపాల్‌నాయక్, నాయకులు మలాకీ రత్నం, అరుణ్‌కుమార్, గండిపేట్, శంషాబాద్, మండలానికి చెందిన పాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మణికొండ: మూడు ముక్కల పేకాట ఆడుతున్న 7 మంది బృందాన్ని నార్సింగి పోలీసులు గురువారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు నార్సింగి ఎస్సై అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బృందం పుప్పాల్‌గూడలో జాదవ్ జీవన్‌కు చెందిన 1-51/4 ఇంట్లో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేశారు. దీంతో పేకాట ఆడుతున్న ఇంటి యజమానితో పాటు ఇంద్రయ్య, రవి, ఎల్లగౌడ్, రమేష్, బాలకృష్ణ, నాగరాజులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 49,270 నగదు, పేకాట సెట్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. ఇంటి యజమాని తన ఇంట్లో పేకాట ఆడించి ప్రతి ఆటకు రూ. వేయి కమిషన్ తీసుకుంటున్నట్టు విచారణలో అంగీకరించాడన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భవానీ కాలనీలో 'కంటి వెలుగు'

రాజేంద్రనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పరీక్షలు చేయించుకుంటున్నారని భవానీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. శుక్రవారం కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంటి వెలుగు కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. కాలనీవాసులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు ఈ కేంద్రానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారన్నారు. నిపుణులైన డాక్టర్ల బృందం కంటి పరీక్షలు చేసి సమస్య ఉన్న వారికి మందు, కళ్లద్దాలను ఉచితంగా అందజేశారన్నారు. అసోసియేషన్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

మణికొండ: సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఐదోతరగతి ప్రవేశపరీక్షను 23న ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నామని నార్సింగి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కృపావరం ప్రకటించారు. నార్సింగి కేంద్రంలో 480 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాస్తారన్నారు. పరీక్షకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఉదయం 10.30 గంటలలోపు కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్ టికెట్‌తో పాటు రెండు పెన్నులు తెచ్చుకోవాలని సూచించారు.